
భోజనంతో పాటు పోషకాహారాన్ని అందజేస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్


పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న నాయకులు


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ భాస్కరరావు


కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆకాశమే హద్దుగా..

సైనికుడు కదనరంగంలోనే యుద్ధం చేస్తాడు. కానీ మహిళ అనునిత్యం యుద్ధం చేయాల్సిందే. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటూ.. కాలమనే కర్కశ రహదారి వెంబడి ముళ్లున్నా.. పూలున్నా ఆగని పయనం సాగించాల్సిందే. మొక్కవోని ఆమె దీక్షని మనసు పెట్టి గమనిస్తే ఎవరైనా అనక మానరు ఆమె ఎక్స్‌లెంట్ అని. అలాంటి ధీర వనితలను చంద్రునికో నూలుపోగులా.. ఈ మహిళా దినోత్సవ వేళ పలు సంస్థలు.. నేతలు సత్కరించి గౌరవించుకున్నారు.

- అన్ని రంగాల్లో మహిళల ముందంజ
- ఓర్పు.. నేర్పులకు పర్యాయపదమై విజయకేతనం

దాబాగార్డెన్స్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వాల్తేర్ రాయల్ రౌండ్ టేబుల్-356, స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ విక్టోరియా ఆసుపత్రి (ఘోషాసుపత్రి)లో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆసుపత్రిలో పేషెంట్ల సహాయకులు, గర్భిణులకు భోజనంతో పాటు పోషకాహారాన్ని సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, రౌండ్ టేబుల్ సంస్థ సభ్యుడు మక్సూద్ అహ్మద్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సీనియర్ సభ్యుడు గజపతిరావు, మహిళా సభ్యులు నాగమణి, సుజాత, రత్న, ఉమాదేవి, రాణి, అచ్యుత, పోలితల్లి తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి మహిళలకు చీరల పంపిణీ

అల్లిపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో గల జీవీఎంసీ ఏయూటీడీ వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న ఒంటరి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బులికృష్ణ దంపతులు చీరలు పంపిణీ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏయూటీడీ సిబ్బంది ప్రగడ వాసు, జ్యోతిర్మయి, లీలావతి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం

అల్లిపురం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వార్డులో బంగారుమెట్ట కమ్యూనిటీ హాల్లో బుధవారం పారిశుధ్య మహిళా కార్మికులను సత్కరించి చీరలు అందజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, పార్టీ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, సచివాలయ కన్వీనర్ ఆడారి మహేష్ పాల్గొన్నారు.

ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

జగదాంబ : సమాజంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. వార్డులోని తన కార్యాలయంలో బుధవారం ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొని పొదుపు సంఘాలకు ఫౌండేషన్ అందిస్తున్న సేవలను కొనియాడారు. మహిళల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తుందని అన్నారు. జోన్-4 యూసీడీ విభాగం ఏపీడీ పుణ్యవతి, కమ్యూనిటీ ఆఫీసర్ ఇంద్రావతి, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫీల్డ్ ఆఫీసర్ చైతన్య, ఏపీ మాస్ కో-ఆర్డినేటర్ సత్యవతి, ధాన్ ఫౌండేషన్ సమన్వయకర్త మురళి, మహిళలు పాల్గొన్నారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

అల్లిపురం : కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ ప్రతినిధి లక్ష్మి ఆధ్వర్యంలో పెద్దాడ సుజాత, మామిడి వరాలమ్మలను పార్టీ నాయకులు సోడదాసి సుధాకర్, పెద్దాడ నాగఫణి, నాయకులు శ్రీనివాస్, మహిళలు సత్కరించారు.

ఏవీఎన్ కళాశాలలో..

మిసెస్ ఏవీఎన్ కళాశాలలో సెట్విస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రి నాయుడు, సెట్విస్ సంస్థ సీఈవో నాగేశ్వరరావు, మహిళా కమిటీ సభ్యులు స్వరాజ్యలక్ష్మి, కార్యదర్శి కృష్ణకుమారి, ట్రెజరర్ మల్లిక తదితరులు సత్కరించారు.

తోట పద్మావతికి సత్కారం

అల్లిపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతిని వార్డు కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమెకు మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. జ్యోతి, ఆశ రామలక్ష్మి, దేవి, అర్జునమ్మ, నాగమణి, ఈశ్వరి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఉందన్నారు.

జ్ఞానాపురం బాబూకాలనీలో..

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం బాబూకాలనీలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి వై.నిఖిలేష్ రాజ్‌కుమార్ నేతృత్వంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యురాలు యాండ్రపు ఫాతిమారాణి హాజరై వేడుకలు ప్రారంభించారు. పలువురు మహిళలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జి.ప్రమీల, ధనలక్ష్మి, ఎ.లక్ష్మి, గవర రమణ, వలంటీర్లు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

భారత్ వికాస్ పరిషత్‌లో..

అల్లిపురం: భారత్ వికాస్ పరిషత్ నారీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 25 సంవత్సరాలకు పైగా ఆధ్యాత్మిక సేవలందిస్తున్న నగరానికి చెందిన ఆర్‌వీఎస్ సూర్యకుమారిని ఘనంగా సత్కరించారు. ఆమె ఆధ్యాత్మిక సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నారి శాఖ అధ్యక్షురాలు వి.సాయినిర్మల, కార్యదర్శి ఎంఎస్ఎల్ శైలజ, కోశాధికారి వి. భువనసుందరి, బీవీపీ ప్రాంతీయ అధ్యక్షుడు వి.సన్యాసిరాజు, విశాఖపట్నం శాఖ అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి పి.భాస్కరరావు, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ పాల్గొన్నారు.


ఒంటరి మహిళలకు చీరలు అందజేస్తున్న బులికృష్ణ దంపతులు


సూర్యకుమారిని సత్కరిస్తున్న భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధులు

బీఎస్ఎన్ఎల్ మహిళా ఉద్యోగుల ర్యాలీ

అల్లిపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భారతీయ సంచార్ నిగం లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయం నుంచి మహిళలు బుధవారం ర్యాలీ నిర్వహించారు. సంస్థలో వివిధ హోదాల్లో పని చేస్తున్న మహిళల ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ జైల్‌రోడ్డు, ప్రకాశరావుపేట, జగదాంబ కూడలి మీదుగా సాగింది. ఈ సందర్భంగా సంస్థ ఉత్పత్తులు, ఉచిత మోడెమ్, ఎఫ్‌టీటీహెచ్, ఫైబర్ కనెక్షన్ తదితర సేవలకు సంబంధించి మహిళా ఉద్యోగులు అవగాహన కలిగిస్తూ ప్రచారం చేశారు.


ర్యాలీలో పాల్గొన్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగినులు

జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగంలో..

అల్లిపురం: జిల్లా గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా సూపరింటెండెంట్ ఇంజనీర్ కేవీ శివానంద్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.శివప్రసాద్, భీమిలి సబ్ డివిజన్ డీఈ ఎం.దుర్గాంబ, డీఈ ఎం. తిరుపతినాయుడు, అసోసియేట్ ట్రెజరర్ వి.రమ్య అనూష, విశాఖ జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ జనరల్ సెక్రటరీ, స్థానిక ఎన్జీవోలు పాల్గొని సంస్థలోని మహిళా ఉద్యోగులను ఘనంగా సత్కరించారు.


జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం మహిళలను సత్కరిస్తున్న అధికారులు


ఏవీఎన్ కళాశాలలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సెట్విస్ ప్రతినిధులు


తోట పద్మావతిని సత్కరిస్తున్న మహిళలు


బాబూకాలనీలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న అతిథులు

క్లుప్తంగా

హోలీ జోష్


అచ్చియ్యమ్మపేటలో యువకుల సందడి

అల్లిపురం: నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. వెంకటేశ్వరమెట్ట, బంగారుమెట్ట, కొబ్బరితోట, నేరెళ్లకోనేరువీధి, చెరువుగట్టు ప్రాంతాల్లో యువత, చిన్నారులు సందడి చేశారు. 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో హోలీ సందడిగా నిర్వహించారు. వాసవీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 201 ఎ గవర్నర్ కందుల నాగరాజు మాట్లాడుతూ మహిళా దినోత్సవం, హోలీ ఒకే రోజు రావటం విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో వాసవీ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ పాలకుర్తి గాయత్రి, ఉమామహేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, కందుల నళినీదేవి, బద్రీనాథ్, కేదార్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఆపన్న హస్తం

కంచరపాలెం: జ్ఞానాపురంలోని బాబూకాలనీలో నివాసం ఉంటున్న నిమ్మడ రమణమ్మ గత కొద్ది రోజులుగా అనారోగ్య కారణంగా మంచాన పడ్డారు. ఆర్థికంగా వెనుకబడిన ఆ కుటుంబం గురించి వలంటీర్ లక్ష్మి కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వైఎస్సార్‌సీపీ వార్డు సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ రమణమ్మకు రూ.5వేలు మందుల ఖర్చుల నిమిత్తం సాయం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.వెళంగిణీరావు, కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ తల్లి పండగ


అమ్మవారి సన్నిధిలో భక్తులు

ఏయూక్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డు పెదవాల్తేరు గ్రామం మద్ది వారి పెద్దిల్లు ఆధ్వర్యంలో సెక్టార్ 5 ఎంవీపీ కాలనీలో ఎల్లమ్మ తల్లి పండగ మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మద్ది అప్పలరాజు రెడ్డి, మద్ది ప్రసాద్ రెడ్డి, మద్ది లక్ష్మణ్ రెడ్డి, మద్ది రమేష్ రెడ్డి మద్ది అప్పల రెడ్డి, మద్ది గుర్నాథ్ రెడ్డి, అప్పల రెడ్డి తదితర భక్తులు, మద్ది వారి కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీదేవికి అష్టోత్తర సేవ


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ దేవి

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో కొలువైన శ్రీలక్ష్మీ దేవి అమ్మవారికి అష్టోత్తర సేవ బుధవారం నిర్వహించారు. 108 కలశాలతో అత్యంత వైభవంగా ఈ సేవ జరిపారు. ఇందులో భాగంగా పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసములతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రీతికరమైన తామర పువ్వులు, పలు రకాల సుగంధ పుష్పాలతో పూజ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పిలకవానిపాలెంలో వాలీబాల్ పోటీలు

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు పిలకవానిపాలెంలో పిళ్లా భరత్ కుమార్ మెమోరియల్ వాలీబాల్ పోటీలు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. అలాగే ఇక్కడ రక్తదాన శిబిరం, వైద్య శిబిరం నిర్వహించారు. 120 యూనిట్ల రక్తం సేకరించారు. శిబిరాన్ని టీడీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, టీడీపీ నాయకుడు పిళ్లా వెంకటరావు ప్రారంభించారు.

కార్మికుల శ్రేయస్సే లక్ష్యం


కార్మిక కుటుంబాలకు మంజూరు పత్రాలు అందిస్తున్న షిప్‌యార్డ్ చైర్మన్ హేమంత్‌ఖత్రి

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ సంస్థలో పని చేస్తున్న కార్మికుల శ్రేయస్సే లక్ష్యంగా సంస్థ పని చేస్తుందని షిప్‌యార్డ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్‌ఖత్రి అన్నారు. షిప్‌యార్డ్‌కాలనీలో ఆధునికీకరణ చేసిన కార్మికుల నివాస గృహాలను బుధవారం ఆయన పునఃప్రారంభించారు. కార్పొరేట్ ప్లానింగ్ డైరెక్టర్ జీపీ గుప్త మాట్లాడుతూ కార్మిక కుటుంబాలకు ఇళ్లు అప్పజెప్పడం ఆనందంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో షిప్‌యార్డ్‌కు మరిన్ని ఆర్డర్లు రాబోతున్నాయని అన్నారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ ఉన్నతాధికారులు, గుర్తింపు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నాటి ఉద్యమం.. నేటి తరానికి స్ఫూర్తి


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు

సీతమ్మధార : విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అనే నినాదం నేపథ్యంగా జరిగిన నాటి ఉక్కు ఉద్యమం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి కె.ఈశ్వరరావు అన్నారు. విశాఖ ఉక్కును విక్రయించరాదని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్ష 704వ రోజు దీక్షలో కాంట్రాక్ట్ కార్మికులు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ రైతులు సాగించిన పోరాట ఫలితంగా మోదీ ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుందని, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అటువంటి పోరాటాలు చేయక తప్పదన్నారు. ఉక్కు నిర్వాసితులు చేసిన ప్రాణత్యాగాలను మోదీ ప్రభుత్వం గుర్తు చేసుకోవాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే దేశంలో నెంబర్ వన్ పరిశ్రమగా ఎదుగుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ హెచ్‌పీసీఎల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు తాతబాబు, వై.నర్సింగరావు, టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో ఆయుష్ హోమం


ఆయుష్ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో బుధవారం అమ్మవారి జన్మ నక్షత్రం (ఉత్తరా నక్షత్రం) పురస్కరించుకుని ఆయుష్ హోమం జరిపారు. ఉదయం 9 గంటలకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి నెలా ఉత్తరా నక్షత్రం రోజున ఉదయం 9 గంటలకు నిర్వహించే ఆయుష్ హోమంలో పాల్గొనదలిచే భక్తులు రూ. 2,516 పూజా రుసుం చెల్లించి పూజలో పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించి, ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన వారు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 వాట్సాప్ నెంబరుకు పంపవచ్చు. కార్యక్రమంలో ఈవో శిరీషతో పాటు ఏఈవో వెంపలి రాంబాబు పాల్గొన్నారు.

ముగిసిన అనంతుని కల్యాణోత్సవాలు


అనంతుని ఉత్సవ విగ్రహాలతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో వారం రోజుల నుంచి జరుగుతున్న అనంతుని కల్యాణోత్సవాలు బుధవారం రాత్రి శ్రీపుష్పయాగంతో ముగిశాయి. ఇందులో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి కుంతీ మాధవ స్వామి ఆలయం చుట్టూ 12 సార్లు ప్రదక్షిణ చేయించారు. అనంతరం ఆలయంలోకి తీసుకెళ్లి ఉభయ దేవేరులతో అనంతునికి శ్రీ పుష్పయాగం నిర్వహించారు. 18 రకాల పుష్పాలు సమర్పించి యాగం జరిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, ఈవో నానాజీబాబు, పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, తాలాడ పద్మనాభం పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం


భక్తులకు దర్శనమిచ్చిన శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

పైడిమాంబ ఘటాల ఊరేగింపు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధి నడుపూరు గ్రామ దేవత పైడిమాంబ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం అమ్మవారి ఘటాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మునగపాక అచ్చింనాయుడు, మంత్రి శంకరానారయణ ఆధ్వర్యంలో వారంరోజుల పాటు ఈ వేడుకలను నిర్వహించనున్నారు. ప్రతి రోజూ వేమువజాము నుంచే అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చనలు చేస్తున్నారు. ఈ నెల 14న ప్రధాన పండగ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీతంరాజు గెలుపు.. అభివృద్ధికి మలుపు


సీతంరాజుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, కార్పొరేటర్ జానకీరామ్


యల్లపువారి వీధిలో ప్రచారం చేస్తున్న ఎస్‌కే సలీం తదితరులు

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సీతంరాజు సుధాకర్ గెలుపునకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ బుధవారం విస్తృత ప్రచారం చేపట్టారు. 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్‌తో కలిసి వార్డులో విద్యావంతులను ఓటు అభ్యర్థించారు. మొదటి ప్రాధాన్యత ఓటును సీతంరాజు సుధాకర్‌కు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రెల్లివీధి, జాలారిపేట, పెయిందొరపేట, గొల్లవీధి, భజన కోవెల, నేవల్ క్యాంటీన్ ఏరియా, నాలుగు సచివాలయాల సిబ్బంది, మూడు ప్రభుత్వ పాఠశాలలు, వైఎస్సార్ అర్బన్ క్లినిక్ ఏరియాలో ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి ప్రచారం చేపట్టారు. డేవిడ్‌రాజు, కాసారపు వాసు, మహిళా నాయకురాలు వెంకటలక్ష్మి, ఆదిలక్ష్మి, సత్యవతి, రోజా రమణి, నాగలక్ష్మి, శేఖర్, గోపి, మన్యాల శ్రీనివాస్, బోని దేవా, బొడ్డేటి కిషోర్, సాగర్, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

34 వార్డుల్లో..

అల్లిపురం: సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటి ప్రచారం చేశారు. అచ్చియ్యమ్మపేట, యాతపేట, నరహరిదొడ్డి ప్రాంతాల్లో కరపత్రాలు అందజేశారు. సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, వార్డు సీనియర్ నాయకుడు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, కర్రి నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

32వ వార్డులో..

సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ 32వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్‌కే సలీం ఆధ్వర్యంలో బుధవారం యల్లపువారివీధి, మార్కెట్‌రోడ్డు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. కార్యకర్తలు కె.రమేష్, నీలబాబు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత


విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, ప్యాడ్‌లు అందజేస్తున్న సుందర్

ఆరిలోవ: శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షలకు సంబంధించిన మెటీరియల్‌ను సామాజిక కార్యకర్త కోలపల్లి ఉదయ సుందర్ బుధవారం అందజేశారు. పరీక్ష ప్యాడ్, పెన్సిల్, పెన్, డ్రాయింగ్ మెటీరియల్‌తో కూడిన కిట్లను ఇక్కడ విద్యార్థులకు అందజేశారు. గురుకులంలో మిగిలిన తరగతుల విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు జాగ్రత్తలు చెప్పారు. క్రమశిక్షణతో చదువుకుని తోటివారికి సహాయం అందించగలిగే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. గురుకులం ఉపాధ్యాయులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యమం మరింత ఉధృతం


755వ రోజు దీక్షలో పాల్గొన్న కార్మికులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కార్మికులు చేస్తున్న ఉద్యమానికి ఎన్నో ఒత్తిళ్లు, మరెన్నో అడ్డంకులు సృష్టించినా ఉక్కు సంకల్పం ముందు నిలబడలేవని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. పైగా రెట్టించిన ఉత్సాహంతో ఉద్యమం ఉధృతం చేస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 755వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో బ్లాస్‌ఫర్నేస్ విభాగానికి చెందిన కార్మికులు కూర్చున్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని కేంద్రం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఎంతో గొప్ప చరిత్ర కలిగిన స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే ఒప్పుకోబోమన్నారు. దీక్షల్లో నాయకులు పాల్గొన్నారు.